మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 6-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 7 Issue: 7

Circulated to Telangana
Published from Jagitial

06 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి షష్ఠి మ. 1:43 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పూర్వాభాద్ర మ. 3:53 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం సౌభాగ్య మ. 3:45 వరకు కరణం వనిజ మ. 1:43 వరకు విష్టి రా. 1:38 వరకు వర్జ్యం రా. 1:49 నుండి తె. 3:26 వరకు దుర్ముహూర్తం మ. 12:46 నుండి మ. 1:38 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:28 నుండి ఉ. 9:05 వరకు యమగండం ఉ. 10:43 నుండి మ. 12:20 వరకు గుళికాకాలం మ. 1:58 నుండి మ. 3:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు ఉ. 7:16 నుండి ఉ. 8:56 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## నేను మూడోసారి అధ్యక్షుడిని!

**అమెరికా వేడుకల్లో డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**బైడెన్ గెలుపు తనదేనంటూ వివాదాస్పద కామెంట్స్**

వాషింగ్టన్, జులై 05: వివాదాస్పద వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించడంలో ఇది మూడోసారి అని చెప్పుకొన్నారు. నిజానికి ఆయన అధికారికంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారే అయినప్పటికీ.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ తన విజయాన్ని దోచుకున్నారని ఆయన పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆ ఎన్నికను కూడా -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,701 |
| వెండి (కిలో): | రూ.2,60,100 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |

### విశ్వవాణి



థాయిలాండ్‌లోని చాలా సూపర్ మార్కెట్లు ప్లాస్టిక్‌ను నిషేధించాయి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా అరటి ఆకులను సంచుల్లా వాడుతున్నాయి. తాజా పండ్లు, కూరగాయలకు అరటి ఆకులను కట్టి అమ్ముతున్నారు.




## కమీషన్ల కక్కుర్తితో
# కాళేశ్వరాన్ని ముంచారు!

**దొంగే దొంగ అన్నట్లుగా కేటీఆర్, బీఆర్ఎస్ నేతల నాటకాలు**

**నీళ్లు నిలిపినపుడు కూలితే భద్రాచలం, 40 ఊళ్లు జలసమాధి**

**బీఆర్ఎస్ అవినీతి పాపమే ప్రాజెక్టు పాలిట శాపం**

**బీఆర్ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజం**

కాళేశ్వరం ప్రాజెక్టును నిలువునా ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కమీషన్ల కక్కుర్తి కోసం ఇంజనీరింగ్ భద్రతను గాలికొదిలేశారని మండిపడ్డారు.

హైదరాబాద్, జూలై 05: ఆదివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల తీరు ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే దొంగే అన్నట్లుగా ఉందని ఉత్తమ్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్టును నాశనం చేసి ఇప్పుడు కేటీఆర్ కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు తరువాయి 2 వ పేజీలో..



## కాళేశ్వరం వరం.. రేవంత్ శనేశ్వరం!

**వారం రోజులు కేసీఆర్‌కి అప్పగించు రాష్ట్రమంతా నీళ్లు పారిస్తాం**

**కక్ష సాధింపుతోనే ప్రాజెక్టును నిలిపేసిన ప్రభుత్వం**

**మోటార్లు ఆన్ చేయకుంటే 50 వేల మందితో ముట్టడి**

**రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**

తెలంగాణ రైతాంగానికి కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ వరంగా ఇస్తే, కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రాష్ట్రానికి పట్టిన శనేశ్వరంగా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. కేవలం రాజకీయ కక్ష సాధింపుల కోసమే కాళేశ్వరాన్ని ఉద్దేశపూర్వకంగా పడావు పెట్టి రైతులను తీవ్ర గోస పెడుతున్నారని ఆయన మండిపడ్డారు.

జయశంకర్ భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా పోలీసులతో అడ్డుకున్నా వాటన్నింటినీ దాటుకుని ఆదివారం ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు కేవలం వారం రోజులు ప్రాజెక్టును అప్పజెబితే, తెలంగాణ అంతటికీ నీళ్లు పారించి చూపుతామని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. మేడిగడ్డ బ్యారేజీతో ఎలాంటి అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయొచ్చని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయం కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసని, కానీ ఒకవేళ నీళ్లిస్తే ఎక్కడ తరువాయి 2 వ పేజీలో...



## మెట్రో ఫేజ్-2కు వెంటనే
# అనుమతులు ఇవ్వండి

**కేంద్ర మంత్రులకు రేవంత్ లేఖలు**

**ఫేజ్-1 స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని విజ్ఞప్తి**

**జాప్యంతో వ్యయం పెరిగే ప్రమాదమని ఆందోళన**

హైదరాబాద్, జులై 5 :

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణకు తక్షణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్-1ను తెలంగాణ ప్రభుత్వ ం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి లేఖలు రాశారు. ఇటీవల జూన్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నతస్థా యి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి లేఖల్లో ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-1 ఆస్తుల (మిగతా 2వ పేజీలో)




## హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

**361 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు**

**ఉపాధి ఉన్న ప్రాంతంలోనే గృహాల నిర్మాణం**

**పాత ప్రభుత్వ గృహాల సర్వేకు ఆదేశం**

రాష్ట్రంలోని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్ర దమైన శాశ్వత నివాసం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.

హైదరాబాద్, జులై 5

ఆదివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తదితరులతో కలిసి (మిగతా 2వ పేజీలో)



## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

జులై 5 (రుద్రన్యూస్) : వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ శాఖ తెలిపి ంది. ప్రస్తుతం ఈ వ్యవస్థ ఒడి శాలోని బాలాసోర్‌కు దక్షిణ-ఆగ్నేయ (మిగతా 2వ పేజీలో)



## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం
# నోటీసులు

**అభ్యంతరకర ప్రకటనలపై ఆగ్రహం**

**వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం**

**చట్టపరమైన చర్యల హెచ్చరిక**

పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర ప్రకటనలు ప్రసారమవుతున్నాయన్న ఆరోపణలపై ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అభ్యంతరకర ప్రకటనలను తక్షణమే తొలగించాలని ఆదేశి ంచిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ, ఈ వ్యవహారంపై పూర్తి వివరణను వారం రోజుల్లోగా సమర్పించాలని సూచించింది.

**ఇటీవల** ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దోపిడీని ప్రోత్సహించేలా కనిపిస్తున్న చెల్లింపు ప్రకటనలు ప్రసారమవుతున్నట్లు వెలుగులోకి రావడంతో కేంద్రం ఈ విషయా న్ని తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగించడంతో పాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలను వివరించాలని మెటాను ఆదేశించింది. ఈ అంశంపై ఇటీవల అంతర్జాతీయ మీడియా కథనం వెలువడిన అనంతరం తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

6.7.2026

**మేషం :** మీ ప్రయత్నాలకు అనుకూల ఫలితాలు లభిస్తాయి. మిత్రుల సహకారంతో విజయం సాధిస్తారు. ఆనందకరమైన సమయం మీ సొంతం అవుతుంది. దత్తాత్రేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**వృషభం :** లక్ష్యసాధనపై దృష్టి పెట్టండి. కుటుంబ వ్యవహారంలో సహనం వహించండి. అనవసర ఆలోచనలకు దూరంగా ఉండాలి. ప్రయాణాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. శివారాధన శుభప్రదం.

**మిథునం :** దైవబలం కలిసి వస్తుంది. చిన్న చిన్న ఆటంకాలను ఎదురైనా అధిగమిస్తారు. కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. దుర్గాదేవి దర్శనం మేలు చేస్తుంది.

**కర్కాటకం :** ఆత్మవిశ్వాసం, నిబద్ధత విజయాన్ని అందిస్తాయి. స్థిరమైన నిర్ణయాలతో ముందుకు సాగండి. బంధువులతో సఖ్యతగా ఉంటే మంచిది. విమర్శలను ధైర్యంగా ఎదుర్కోండి. ఆంజనేయ స్వామి ఆరాధన శుభప్రదం.

**సింహం :** సానుకూల ఆలోచనలతో విజయాలు సాధిస్తారు. శుభవార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. ముఖ్యమైన పనుల్లో బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. శివారాధన మేలు చేస్తుంది.

**కన్య :** శుభకాలం కొనసాగుతుంది. బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యుల సహకారంతో విజయాలు సాధిస్తారు. గురుచరిత్ర పారాయణం శుభదాయకం.

**తుల :** శుభయోగం ఉంది. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తారు. ఉత్సాహంగా పనులు పూర్తి చేస్తారు. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. ఇష్టదైవారాధన ఉత్తమం.

**వృశ్చికం :** మిశ్రమ ఫలితాలు ఉంటాయి. కీలక నిర్ణయాల్లో జాగ్రత్తలు అవసరం. పెద్దల సలహాతో ముందుకు సాగితే మంచిది. ఆధ్యాత్మిక చింతన మనశ్శాంతినిస్తుంది. నవగ్రహ స్తోత్రం చదవండి.

**ధనుస్సు :** ఆత్మీయుల సహకారం విజయానికి దోహదం చేస్తుంది. వివాదాలను నివారించి సంయమనంతో వ్యవహరించాలి. సహనం మీ బలం అవుతుంది. శని శ్లోకం చదివి ఆంజనేయ స్వామిని దర్శించండి.

**మకరం :** శుభకాలం. ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుంది. విష్ణు సహస్రనామ పారాయణం మేలు చేస్తుంది.

**కుంభం :** పట్టుదలతో కృషి చేస్తే విశేష ఫలితాలు పొందుతారు. వివాదాలకు దూరంగా ఉండండి. ఎవరినీ అతిగా నమ్మకపోవడం మంచిది. శనికి తైలాభిషేకం శుభప్రదం.

**మీనం :** ఓర్పు, ప్రణాళికతో ముందుకు సాగితే విజయం మీ సొంతమవుతుంది. ఖర్చుల్లో జాగ్రత్త అవసరం. ఆలోచించి మాట్లాడటం మేలు చేస్తుంది. శ్రీరామరక్షా స్తోత్రం పారాయణ శుభదాయకం.

# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

361 మంది లబ్ధిదారులకు రెండు పడకగదుల ఇళ్ల పట్టాలు, తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తు న్న గృహ నిర్మాణ కార్యక్రమాలపై మంత్రులు వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా గృహాల కోసం ఎదురు చూసిన పేద కుటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రభుత్వం పూర్తిగా గుర్తించిందన్నారు. ఆ జాప్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని, ఇకపై అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కుటుంబాలకు పట్టాలు అందించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న నిరుపేదలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా, వారు పనిచేస్తున్న ప్రాంతాల్లోనే గృహాలు నిర్మించి అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం అవస రమైతే విలువైన ప్రభుత్వ భూములను కూడా వినియోగించేందుకు వెనుకాడబోమన్నారు . హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా న్ని లక్ష్యంగా పెట్టుకుని అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారని, దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా గృహ నిర్మాణ విధానాన్ని రూపొందించామని చెప్పారు. ప్రభుత్వం గృహాలకే పరిమితం కాకుండా పేదల సంక్షేమాన్ని సమగ్రంగా అమలు చేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తున్నామని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి 48 గంటల్లోనే కార్డులు జారీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ ం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. హైదరాబాద్ నగరంలోని పాత ప్రభుత్వ గృహ సముదాయాలు, వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథకాల కింద నిర్మించిన భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నివా సయోగ్యం కాని భవనాలను వెంటనే ఖాళీ చేయించి, మరమ్మతులు చేయదగిన భవనాలను పునరుద్ధరించాలని, పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. భవనాలను మూడు విభాగాలుగా వర్గీకరించి సమగ్ర నివేదికను ప్రభుత్వం ముందుంచాలని అధికా రులకు స్పష్టం చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీ న్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించ డం సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ మొత్తం 361 గృహాలను లబ్ధిదారులకు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో చాంద్రాయ ణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన వారికి 187, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన వారికి 79, నాచారం కాలనీ ప్రాంతానికి చెందిన వారికి 95 గృహాలు కేటాయించినట్లు వివరించారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలు రాష్ట్రంలో సామాజిక భద్రతను మరింత బలోపేతం చేస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

# కాళేశ్వరాన్ని ముంచారు!

మొదటి పేజీ తరువాయి




వెళ్లి నీళ్లు ఇవ్వాలంటూ నాటకాలు ఆడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. పదేళ్లలో ఇరిగేషన్ శాఖను సర్వనాశనం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దాన్ని గాడిలో పెడుతోందని స్పష్టం చేశారు.

### ప్రమాదకర స్థితిలో కాళేశ్వరం బ్యారేజీలు

కాళేశ్వరం బ్యారేజీల పునాదులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. ఒకవేళ కేటీఆర్ మాటలు విని ఇప్పుడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేస్తే అవి కూలిపోయి భద్రాచలంతో పాటు దిగువన ఉన్న 40 గ్రామాలు వరదలో కొట్టుకుపోవడం ఖాయమని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. ప్రాజెక్టును కట్టింది, అది కుంగిపోయింది బీఆర్ఎస్ హయాంలోనేనని ఇంజనీర్లు స్పష్టమైన నివేదికలు ఇచ్చారన్నారు. ప్రాజెక్టును ఇలానే వాడితే ప్రమాదమని జాతీయ, అంతర్జాతీయ నిపుణులు తేల్చి చెప్పారని స్పష్టం చేశారు. అసలు నిపుణులైన ఎన్డీఎస్ఏ అధికారుల కంటే కేటీఆర్‌కే ఎక్కువ నాలెడ్జ్ ఉందా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

మూడు బ్యారేజీల మరమ్మతులపై ప్రభుత్వం అత్యంత శాస్త్రీయంగా ముందుకెళ్తోందని ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్యారేజీల టెస్టింగ్ చివరి దశలో ఉందని, ఐఐటీ బాంబే నివేదిక రాగానే అసలు వాస్తవాలు బయటపడతాయన్నారు. బహుశా దయాఫ్రమ్ వాల్ కూడా కొత్తగా కట్టాల్సి రావొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అక్టోబర్ నాటికి రిపేర్లపై తుది నిర్ణయం తీసుకుని, నెలరోజుల్లో పనులు మొదలుపెడతామన్నారు. వచ్చే వానాకాలం అనగా 2027 జూలై-ఆగస్టు నాటికి మూడు బ్యారేజీల మరమ్మతులను ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఉంటే ఉత్తర తెలంగాణ ఎప్పుడో సస్యశ్యామలం అయ్యేదని మంత్రి అభిప్రాయపడ్డారు. కేవలం కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో, కమీషన్లకు కక్కుర్తి పడే డిజైన్ మార్చి మేడిగడ్డకు తీసుకెళ్లారని ఆరోపించారు. అయితే ప్రస్తుతం తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల నీటిని తెచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. తుమ్మిడిహట్టి, ఎల్లంపల్లి విషయమై ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. ఎల్‌నినో అనేది ప్రపంచ స్థాయి సమస్య అని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# రేవంత్ శనేశ్వరం!

మొదటి పేజీ తరువాయి

యూరియా, మద్దతు ధర, బోనస్, కరెంటు ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతోనే ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయడం లేదని ఆరోపించారు. కరువు పరిస్థితుల్లోనూ కన్నెపల్లి వద్ద పుష్కలంగా నీళ్లున్నాయని, కానీ నేడు 98 వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ పిల్లర్ల నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ తన సొంత ఖర్చుతో ముందుకొచ్చినా ప్రభుత్వం ఎందుకు అనుమతించడం లేదని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ అసమర్థత, అవినీతి వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది చనిపోయారని కేటీఆర్ ఆరోపించారు. సుంకిశాల గోడ కూలినా, వట్టెం పంప్ హౌస్ కొట్టుకుపోయినా ఈ దరిద్రపు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.94 వేల కోట్లు ఖర్చు అయితే.. ఏకంగా లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని నిలదీశారు. ఏనాడూ నీరు చూడని సూర్యాపేట జిల్లాకు సైతం సాగునీరు అందించింది కాళేశ్వరం ప్రాజెక్టేనని, వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను మించి రాష్ట్రం మొదటి స్థానంలో నిలవడానికి ఈ ప్రాజెక్టే కారణమని ఆయన గుర్తుచేశారు. సీఎం రేవంత్‌కు సోయి లేక కాళేశ్వరాన్ని పడావు పెట్టడం వల్లే.. నేడు హైదరాబాద్‌లో తాగునీటి కోసం 15 వేల ట్యాంకర్లు పెరిగాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే మేల్కొని కన్నెపల్లి పంపులను ఆన్ చేసి తీరాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 50 వేల మందితో కన్నెపల్లి పంప్ హౌస్‌ను ముట్టడిస్తామని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పర్యటనలో మధుసూదనాచారి, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ తదితర సీనియర్ నాయకులు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాయుగుండం ప్రభావం..

(మొదటి పేజీ తరువాయి)

దిశలో కేంద్రీకృతమై ఉందని, రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు వెల్లడించా రు. దీని ప్రభావంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం వాయు గుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపం లో చాంద్‌బలి-దిఘా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. అనంతరం ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు పయనించనుంద ని పేర్కొంది. దీని ప్రభావంతో అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుం చి మోస్తరు వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురి సే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు స్థానిక అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు వెల్లువె త్తాయి. దీనిపై స్పందించిన కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించగా, ఆదివారం సంబంధిత శాఖ మెటాకు అధికారిక నోటీసులు పంపింది. అభ్యంతరకర ప్రకటనలు ఎలా అనుమతించబడ్డాయో, వాటి నియంత్రణకు ఎలాంటి వ్యవస్థ అమల్లో ఉందో వివరించా లని కేంద్రం కోరింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి కంటె ంట్‌ను గుర్తించి అడ్డుకునేందుకు అనుసరించబోయే విధా నాలపై కూడా స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సూచించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపిస్తు న్న కొన్ని ప్రకటనలపై క్లిక్ చేస్తే ఇతర వేదికలకు మళ్లించి అభ్యంతరకర కంటెంట్‌ను అందిస్తున్నట్లు కేంద్రం గుర్తించి నట్లు సమాచారం. ప్రకటనల ద్వారా ఆదాయం లభిస్తున్నం దున వాటి పర్యవేక్షణ బాధ్యత నుంచి సంస్థ తప్పించుకోలే దని కేంద్రం స్పష్టం చేసింది. మెటా సమర్పించే వివరణ సంతృప్తికరంగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లల భద్రతకు భంగం కలిగిం చే, చట్టవ్యతిరేక కంటెంట్‌పై కఠిన చర్యలు కొనసాగుతా యని అధికారులు తెలిపారు.

## మెట్రో ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ, ఫేజ్-2 విస్తరణకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను నోడల్ ఏజెన్సీ గా నియమించాలని అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఖరారు చేయకపోవడ ంతో పాటు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారిక బాధ్యతలు అప్పగించడ ంలో జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆలస్యం వల్ల మెట్రో ఫేజ్-1 నిర్వహణలో ఇబ్బందు లు తలెత్తుతున్నాయని, ఫేజ్-2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీ కరణ ప్రక్రియ కూడా ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. జాప్యం కొనసాగితే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజారవాణా అవ సరాలకు మెట్రో ఫేజ్-2 అత్యంత కీలకమని, అందువల్ల ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

# నేను మూడోసారి అధ్యక్షుడిని!

మొదటి పేజీ తరువాయి

తన ఖాతాలోనే వేసుకుంటూ.. 'నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్లు లెక్క. కానీ, వివాదాల జోలికి వెళ్లకూడదను కుంటున్నాను కాబట్టి.. నేను అలా అనను' అని నర్మగర్భంగా వ్యాఖ్యాని స్తూనే, అంతలోనే నవ్వుకుంటూ వివాదాస్పద అంశాల జోలికి పోవాలనుకోవట్లేదంటూ ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదిగిందంటే అది అనుకోకుండా జరిగిందేమీ కాదని, తాను మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు దేశ సైన్యాన్ని పునర్నిర్మించి, సైనిక సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతో కృషి చేశానని ట్రంప్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, 2020 ఎన్నికల్లో పరాజయం పాలైన ట్రంప్.. తన ఓటమిని అంగీకరించకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఫలితాలను మార్చాలనే ఉద్దేశంతో పలు కీలక రాష్ట్రాల్లో వ్యాజ్యాలు దాఖలు చేసినప్పటికీ, తన ఆరోపణలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. మరోవైపు జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకునేందుకు 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్ భవనంపై జరిపిన దాడి అప్పట్లో తీవ్ర వివాదానికి దారితీయగా.. ట్రంపే వారిని రెచ్చగొట్టారనే ఆరోపణలు వచ్చాయని ఈ కథనంలో పేర్కొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి: ఎంపీ లావు వినతి

పల్నాడు జిల్లా, జూలై 05: జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలోని ఎస్టీ (గు) విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడానికి ప్రభుత్వం తరఫున మరింత తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. జిల్లాలో గిరిజన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన వసతి గృహాలను (హాస్టళ్లను) మంజూరు చేయాలని, అలాగే ప్రస్తుతం అందుబాటులో ఉన్న హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరతను తీర్చి తక్షణమే వాటిని పునరుద్ధరించి, ఆధునీకరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## వైసీపీ అంతర్గత అసంతృప్తే 'సర్' ఆలస్యానికి కారణం: ఎంపీ లావు

మాచర్ల/ దుర్గి, జూలై 05: వైసీపీలో నెలకొన్న అంతర్గత అసంతృప్తి, విభేదాల కారణంగానే 'సర్' (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియ మందగమనంలో సాగుతోందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. ఆదివారం మాచర్లలోని కేపీసీ అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. వైసీపీ నాయకత్వం ప్రజాస్వామ్యానికి కీలకమైన ఈ ప్రక్రియపై కుతంత్రాలు పన్నుతోందని, ఆ పార్టీ క్యాడర్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం వల్లే ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి రాజకీయ వైఖరిని తప్పుబడుతూ, ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు ఉన్నా వాటిని ఆధారాలతో చూపిస్తే సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డులో కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల కూటమి పార్టీల బూత్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'సర్' సమీక్షా సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం కూడా ప్రజాసేవలో భాగమేనని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12వ తేదీలోపు 'సర్' ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని.. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితా సవరణను వేగవంతం చేయాలని సూచించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ బాధ్యతను చురుగ్గా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాలకు చెందిన కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం

వినుకొండ, జూలై 05: రూ.3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు సంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయికి దీటుగా ఆధునిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు మెరుగైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు వసతి భవనం ఎంతగానో దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ మరియు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూసేందుకు మరియు వారి సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని విద్యా, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గిరిజన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కక్షసాధింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం: బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ, జూలై 05: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వినుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా పక్కనబెట్టి, కేవలం రాజకీయ, వ్యక్తిగత కక్షసాధింపులకే ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన ఎన్ఎస్‌పీ భూముల్లో జర్నలిస్టులకు స్థలాలు, కూరగాయల మార్కెట్, వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ వంటి పనులను గాలికొదిలేశారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేపట్టిన గురుకుల పాఠశాల, 100 పడకల ఆస్పత్రి, రహదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వరికుడిశెల ప్రాజెక్టు, కేంద్ర విద్యాలయం, తాగునీటి సమస్యలపై కూటమి ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ధ్వజమెత్తారు.

వర్షాభావ పరిస్థితుల్లో చెరువుల నీటిని చేపల వేట పేరుతో ఖాళీ చేయడం వల్ల భూగర్భ జలాలు పడిపోయి, భవిష్యత్తులో తాగునీటి తీవ్ర సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బినామీ పేర్లతో ఒకే సొసైటీ ఆధీనంలోకి చెరువులను తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడుతున్నారని, మైనింగ్, భూకబ్జాల విషయంలో కూటమి నాయకులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కలెక్టర్ జోక్యం చేసుకుని చెరువులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలపై జనసేన తీవ్ర ఆగ్రహం

దాచేపల్లి, జూలై 05: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జోసఫ్ రావణ్‌ను సమర్థిస్తూ నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలను దాచేపల్లి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పాముల కిషోర్ తీవ్రంగా ఖండించారు. కేవలం గుర్తింపు కోసమే కొందరు ఉద్దేశపూర్వకంగా సభలు పెట్టి పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇలాంటి కుట్రల వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని ఆయన మండిపడ్డారు. ప్రకాష్ రాజ్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించిన కిషోర్.. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలే ప్రజాస్వామ్యబద్ధంగా తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.



# ఖమేనీ అంత్యక్రియలకు మొజ్తాబా దూరం



### భార్య అంత్యక్రియలకూ బయటకు రాని ఇరాన్ సుప్రీం లీడర్

టెహ్రాన్, జులై 05: రాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ పార్థివ దేహాన్ని కడసారి చూసేందుకు రాజధాని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయానికి లక్షలాదిగా అభిమానులు, మద్దతుదారులు తరలివచ్చారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల వేళ అలీ ఖమేనీ శవపేటిక వద్ద ఆయన ముగ్గురు కుమారులు మొస్తఫా, మెయిసమ్, మసౌద్ ఖమేనీలతో పాటు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘెర్ ఘాలిబఫ్, విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ అహ్మద్ వాహిదీలు నివాళు లర్పించారు. అయితే, తండ్రి మరణానంతరం దేశ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ మాత్రం ఈ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరుకాకపోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించేలేదు. వారం క్రితం జరిగిన మొజ్తాబా భార్య అంత్యక్రియల్లో కూడా ఖమేనీ పాల్గొనలేదు. తండ్రి అయాతుల్లా ఖమేనీపై జరిగిన దాడిలోనా మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. ఆ దాడి తర్వాత మొజ్తాబా ఎక్కడా కనిపించకపోవడం, ఆయన తరఫున ప్రకటనలు మాత్రమే విడుదల కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. ఐతే ఇరాన్న ప్రభుత్వం మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా ఆయన బయటకు రావడం లేదని చెబుతోంది.

## జనసేన 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్'

# దరఖాస్తుల ప్రక్రియ దిగ్విజయం

విజయవాడ, జూలై 05: సమర్థవంతమైన క్షేత్రస్థాయి నాయకత్వాన్ని పెంపొందించడం, జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత ఆరు రోజులుగా నిర్వహించిన 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' దరఖాస్తుల సేకరణ ప్రక్రియ ఆదివారంతో దిగ్విజయంగా ముగిసింది. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విజయవంతంగా ముగిసిన ఈ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.. పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కోసం ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేసి, 32 మంది సభ్యుల అబ్జర్వర్స్ బృందంతో ప్రతి అప్లికేషన్‌ను సునిశితంగా పరిశీలించారు. లోక్‌సభ కమిటీతో పాటు వివిధ అనుబంధ విభాగాలు, వీరమహిళా కమిటీల కోసం వేలాది మంది జనసైనికులు, వీరమహిళలు ఈ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని దరఖాస్తులు సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై వేలాదిగా తరలివచ్చిన జనసైనికుల స్పందన పార్టీపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి నిదర్శనమన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో సముచిత గౌరవం, తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థుల అర్హతలను బట్టి వచ్చిన ఈ దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అధినేత పవన్ కళ్యాణ్ సమర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ అంతా ఆగస్ట్ నాటికి పూర్తవుతుందని, ఆ తర్వాత వచ్చే నూతన కమిటీల సభ్యులందరినీ కలుపుకొని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీని తిరుగులేని శక్తిగా మార్చే దిశగా కలిసికట్టుగా ముందుకు సాగుతామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

## ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్

### బీజేపీ కంచుకోటలో పోటీకి సిద్ధం

పాట్నా, జులై 05: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగబోతున్నారు. బిహార్‌లోని అత్యంత కీలకమైన బంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆయన స్వయంగా పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు జన్ సురాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతీ పీకే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ నెల 30న బంకీపుర్ స్థానానికి పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలుపొందిన భాజపా జాతీయ నాయకుడు నితిన్ నబీన్, అనంతరం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు ఎన్నికవడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. భాజపాకు తిరుగులేని కంచుకోటగా భావించే ఈ స్థానానికి కమలం పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించకపోగా, ప్రశాంత్ కిశోర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఇక్కడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల వ్యూహకర్త హోదా నుంచి సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించిన ప్రశాంత్ కిశోర్‌కు గత ఎన్నికల్లో తీవ్ర భంగపాటు ఎదురైన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో పీకే స్వయంగా పోటీ చేయనప్పటికీ, ఆయన నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ రాష్ట్రంలోని మొత్తం 243 స్థానాలకు గానూ 238 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టింది. అయితే, ఒక్క సీటులోనూ విజయం సాధించలేక ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పట్లో పీకే కొన్ని రోజుల పాటు మౌనవ్రతం కూడా ఆచరించారు. ఈ నేపథ్యంలో, దేశ వ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల నిమిత్తం కేంద్ర ఎన్నికల సంఘం మూడు రోజుల క్రితమే షెడ్యూల్ విడుదల చేయగా, జులై 6న అధికారిక నోటిఫికేషన్ వెలువడనుంది.

## 40 మంది పేద విద్యార్థులకు 2 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేసిన ప్రభుత్వ విప్ బొండా ఉమా

విజయవాడ, జూలై 05: 60వ డివిజన్ వాంబే కాలనీలో గొర్తి ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, గొర్తి చక్రవర్తి సహకారంతో 40 మంది పేద విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.2 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులతో పాటు ఉచితంగా పుస్తకాలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ‘పీ-4’ (పీపుల్స్ ప్రొటెక్ట్ ప్లాన్ ఫర్ పావర్టీ ఎలివేషన్) కార్యక్రమం స్ఫూర్తితో ఉన్నవారు లేనివారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సీఎం పిలుపుతో ప్రేరణ పొంది పేద విద్యార్థుల చదువుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గొర్తి ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ను, గొర్తి చక్రవర్తిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు, షూస్ వంటి అన్ని వసతులను కల్పిస్తూ మధ్యాహ్న భోజనం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని బొండా ఉమా తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాల తలరాతలు మారుతాయని, చదువుకునే వయసులో విద్యార్థులు పూర్తి ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు హృదయపూర్వక ఆశీస్సులు అందజేశారు.

నేటి ఈవార్తలు
COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811  Email: contact@evarthalu.com

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 10 రోజుల్లో కాలువలు, కల్వర్ట పనులు పూర్తి చేస్తాం: ప్రభుత్వ విప్ బొండా ఉమా

విజయవాడ, జూలై 05: 63వ డివిజన్ సుందరయ్య నగర్‌లో కాలువలు, కల్వర్ట అధ్వాన పరిస్థితిని ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు అక్కడ పర్యటించిన ఆయన, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 10 రోజుల వ్యవధిలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో కాలువలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని బొండా ఉమా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, ప్రధాన కార్యదర్శి కోలా శ్రీను, లబ్బా దుర్గా, దుర్గాసి రాము, ఆంజనేయులు, ఎస్కే మెహర్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై డైరెక్టర్లుగా ముగ్గురికి నియామక పత్రాలు: బొండా ఉమా

విజయవాడ, జూలై 05: ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా 59వ డివిజన్ సెక్రటరీ బుదాల సురేష్ బాబు, కేశవరపు సాంబశివరావు, నల్లమట్టి కామేశ్వరరావులకు సివిల్ సప్లై డైరెక్టర్లుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించి, ప్రజల మధ్య నిరంతరం పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, తగిన స్థానం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. తమకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు నియామక పత్రాలు అందుకున్న ముగ్గురు నేతలు ఎమ్మెల్యే బొండా ఉమాకు కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, మరకా శ్రీనివాస్, బంగారు నాయుడు, లబ్బా వైకుంఠం తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అలవాల గ్రామంలో విషాదం: తండ్రి, కుమార్తె మృతి

పల్నాడు జిల్లా, జూలై 05: రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో ఆదివారం ఒకే కుటుంబానికి చెందిన వృద్ధుడు, ఆయన కుమార్తె మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన గోనుగుంట్ల పోతులూరయ్య (75), తన భార్య మరియు కుమారుడు కొన్నేళ్ల క్రితమే మృతి చెందడంతో కుమార్తె రామాంజమ్మ (50)తో కలిసి నివసిస్తున్నారు. కుటుంబ సభ్యుల మరణం, వృద్ధాప్య భారంతో పాటు ఎదురవుతున్న కుటుంబ సమస్యల కారణంగా ఆయన కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆదివారం పోతులూరయ్య తన ఇంట్లో మృతి చెంది కనిపించగా, అనంతరం ఆయన కుమార్తె రామాంజమ్మ కూడా అదే ఇంట్లో శవమై తేలింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, పూర్తి వివరాలు విచారణలో వెల్లడికానున్నాయని తెలిపారు.



# బాలాలయంలోకి సరస్వతీ అమ్మవార్లు

**ఆలయ పునర్నిర్మాణంతో గర్భగుడిలో భక్తులకు ప్రవేశం నిలిపివేత**

బాసర, జూలై 05: నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రధాన గర్భగుడిలో భక్తులకు దర్శనాలు, పూజలను నిలిపివేశారు. ఆదివారం ప్రధానాలయంలో ఉన్న సరస్వతి, లక్ష్మీ, మహాంకాళి అమ్మవార్లతో పాటు శృంగేరి పీఠాధిపతులు అందించిన ఉత్సవమూర్తులకు సంకల్పం, గణపతి పూజ తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించి బాలాలయానికి తరలించారు. అనంతరం దేవతామూర్తులకు మహా హారతి ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు భక్తులకు దర్శనం, అక్షరాభ్యాసం, నిత్య పూజలన్నీ బాలాలయంలోనే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. అంతకుముందు ప్రధాన దేవాలయ నిర్మాణానికి దాతతో కలిసి స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమి పూజ చేశారు. ఆ తర్వాత బాలాలయంలో అక్షరాభ్యాసాలు, ప్రత్యేక పూజలను లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడి ఏర్పాట్లను ఆలయ ఈవో అంజనీదేవి, ఏఈవో శ్రీనివాస్, స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పాఠక్ పర్యవేక్షిస్తున్నారు.

# వ్యవసాయంలో సాంకేతిక విప్లవం

**- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**- ఏఐ, ఉపగ్రహ సాంకేతికత వినియోగానికి సన్నాహాలు**

**- ఫర్టిలైజర్ యాప్‌తో అక్రమాలకు చెక్:మంత్రి తుమ్మల**

హైదరాబాద్, జూలై 05: వ్యవసాయ రంగంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టిందని, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, భూమి ఆధారిత పంపిణీతో యూరియా అక్రమాలకు అడ్డుకట్ట పడుతోందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 17.70 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 59.78 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 52.86 లక్షల బస్తాల కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, పారదర్శకత కోసం ప్రతిరోజూ జిల్లాల వారీగా యూరియా బులెటిన్లు విడుదల చేస్తున్నామని మంత్రి వివరించారు.

యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై ఉక్కుపాదం మోపుతున్నామని, నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశామని మంత్రి తుమ్మల హెచ్చరించారు. భవిష్యత్తు వ్యవసాయంలో కృత్రిమ మేధ, ఉపగ్రహ సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలపై ప్రయోగాలు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసి రైతాంగానికి మేలు చేసేందుకు, జర్మనీలోని పలు అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా చర్చలు జరుపుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.



# అయోధ్య విరాళాల చోరీ కలకలం

**నేడు రామమందిర ట్రస్ట్ కీలక భేటీ!**

ఇంటర్నెట్ డెస్క్, జూలై 05: అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక సమావేశానికి సిద్ధమైంది. సోమవారం ఆలయ ప్రధాన అధికారులు, అర్చకులతో నిర్వహించనున్న ఈ భేటీలో.. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై ప్రధానంగా చర్చించనున్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్, సీనియర్ ట్రస్టీ పరాశరన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. ఒకవేళ ప్రధాన కార్యదర్శి రాజీనామా ఆమోదం పొందితే, ఆయన స్థానంలో కొత్త అధికారి నియామకంతో పాటు మందిర భవిష్యత్తు నిర్వహణ, నూతన పరిపాలన వ్యవస్థ ఏర్పాటుపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

మరోవైపు ఈ వ్యవహారంపై రాజకీయ ప్రకంపనలు రేగుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణల్లోని వాస్తవాలను, వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించాలని విశ్వ హిందూ పరిషత్ అయోధ్య పోలీసులకు లేఖ రాసింది. అదే సమయంలో, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముంబయిలో 'రామ రక్ష' పేరిట చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ.. దోచుకునేవారే అధికారంలో ఉన్నారని, అయోధ్య కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, కాశీ, మథురలలో జరగబోయే దోపిడీ గురించి ఆందోళనగా ఉందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# నాగలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి ఆనం భూమిపూజ

నెల్లూరు జిల్లా, జూలై 05: చేజర్ల మండలం పెరుమాళ్ళపాడులో పెన్నా నది ఒడ్డున ఇసుక మేటల కింద నుంచి వెలుగులోకి వచ్చిన, సుమారు 300 ఏళ్ల నాటి చారిత్రాత్మక శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం ఘనంగా భూమిపూజ చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్ల సిజిఎఫ్ నిధులతో, రోడ్డుకు సమీపంలోని ఐదు ఎకరాల విశాల ప్రాంగణంలో భారతీయ శిల్పకళ, సనాతన వారసత్వం ఉట్టిపడేలా ఈ భవ్య ఆలయాన్ని నిర్మించనున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడుతూ.. ప్రాచీన దేవాలయాల సంరక్షణ, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం చేజర్లలో రూ.2 కోట్లతో చేపట్టనున్న శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు కూడా మంత్రి భూమిపూజ చేయడంతో పాటు, గ్రామంలో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.



# మెట్రో ఫేజ్-2 కు అనుమతివ్వండి

**ఫేజ్-1 మాకివ్వండంటూ కేంద్రానికి సీఎం రేవంత్ లేఖ.. వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి**

హైదరాబాద్, జూలై 05: భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకునే ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఫేజ్-2 విస్తరణకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిలకు ఆయన విడివిడిగా లేఖలు రాశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రాష్ట్రం సొంతం చేసుకునే క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల నియామకంలో జరుగుతున్న జాప్యంపై సీఎం తన లేఖలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జూన్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఫేజ్-1 ఆస్తుల విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు ఫేజ్-2కు దీర్ఘకాలిక నిధుల సమీకరణపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని నాడు ఉమ్మడిగా అంగీకారం కుదిరిందన్నారు. అయితే, ఈ విషయంలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఖరారు చేయకపోవడం, సదరు ఏజెన్సీకి అధికారికంగా బాధ్యతలు అప్పగించకపోవడం పట్ల సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఈ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తిచేయాలని కోరారు.

కేంద్రం చేస్తున్న ఈ జాప్యం వల్ల ఫేజ్-1 మెట్రో రోజువారీ నిర్వహణలో అనిశ్చితి, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి తన లేఖలో వెల్లడించారు. ఫేజ్-2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమైతే ప్రాజెక్టు అమలు మరింత వాయిదా పడటమే కాకుండా, నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెట్రో విస్తరణ పనులు ఆగకూడదని, కేంద్రం త్వరగా స్పందిస్తే రాష్ట్రం మెట్రోను సొంతం చేసుకునే ప్రక్రియ సాఫీగా పూర్తవడంతో పాటు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఫేజ్-2 పనులు ముందుకు సాగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# 48 గంటల్లో కొత్త రేషన్ కార్డు

**పేదలకు ఉపాధి ఉన్న చోటే ఇందిరమ్మ ఇళ్లు**

**పాత గృహ సముదాయాలపై సమగ్ర సర్వేకు ఆదేశం**

**నిరుపేదలకు మంత్రులు పొన్నం, అజారుద్దీన్ భరోసా**

హైదరాబాద్, జూలై 05: హైదరాబాద్ నగరంలో వివిధ వృత్తుల్లో ఉపాధి పొందుతున్న పేదలకు, వారు పనిచేసే ప్రాంతాల్లోనే సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో 361 మంది పేదలకు 2 బీహెచ్‌కే గృహాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు శాశ్వత గృహం కల్పించడం సామాజిక న్యాయానికి ప్రతీక అని, పారదర్శకంగా గృహాల పంపిణీ జరుగుతోందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. గత పదేళ్లుగా ఇళ్ల కోసం లబ్ధిదారులు పడిన ఇబ్బందులకు ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి పొన్నం విచారం వ్యక్తం చేశారు. నిరుపేదల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకు విలువైన ప్రభుత్వ భూములను సైతం వెచ్చించి నగరంలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని ఆయన ప్రకటించారు.



పాత ప్రభుత్వ గృహ సముదాయాలు, వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద నిర్మించిన భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి పొన్నం ఆదేశించారు. నివాసయోగ్యం కాని వాటిని ఖాళీ చేయించి, మరమ్మతులకు నోచుకునేవి బాగుచేసి, శిథిలావస్థకు చేరిన వాటిని కూల్చి పునర్నిర్మించేలా మూడు విభాగాలుగా నివేదిక సిద్ధం చేయాలన్నారు. కొత్త గృహాల కేటాయింపులో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. అలాగే త్వరలో కొత్తగా రెండు లక్షల సామాజిక భద్రతా పింఛన్లు అందజేస్తామని మంత్రి తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో పేదలకు ఎలాంటి జాప్యం జరగకుండా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు భరోసా ఇచ్చారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే కొత్త రేషన్ కార్డు జారీ చేయడంతో పాటు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ వివరించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, కలెక్టర్ ప్రియాంకా ఆలా తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలపు సమస్యలపై చర్యలేవి

**సీఎం రేవంత్‌ను నిలదీసిన కిషన్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 05: హైదరాబాద్ నగరంలో వర్షాకాలం సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. మురుగు కాలువల్లో ఎక్కడా పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్లే, చిన్నపాటి వర్షానికే నగరంలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వర్షాకాలంలో నగర ప్రజలు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు.

ఈ పర్యటనలో భాగంగా ఫిట్ ఇండియా-హెల్త్ ఇండియా కింద పలు పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను కిషన్ రెడ్డి ప్రారంభించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్‌ను లండన్, సింగపూర్‌గా మారుస్తామని గొప్పలు చెప్పాయే తప్ప, ఆచరణలో నగర అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని దుయ్యబట్టారు.

కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ల వల్ల వేడి విపరీతంగా పెరిగిపోతోందని కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ నెలలో నగరంలో సాధారణం కంటే 50 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా మూసీ ద్వారా సముద్రంలో కలవకుండా.. కాపాడుకోవాలని నగరవాసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# రెడ్డిపాలెం పీఏసీఎస్‌లో సాకారోత్సవాలు

రొంపిచర్ల, జూలై 05: రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో ఆదివారం సాకారోత్సవాల సందర్భంగా రైతులకు సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్) సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు జల్లిపల్లి శేషమ్మ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతులకు సీఎస్సీ సెంటర్ ద్వారా అందే వివిధ ప్రభుత్వ, డిజిటల్ సేవల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో లక్ష్మిరెడ్డి, సిబ్బంది వీరారెడ్డి, అనిల్, మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

# పద్మశాలి వైద్యుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ అందే వెంకటేశ్వరరావు ఎన్నిక

విజయవాడ, జులై 05: పద్మశాలి వైద్యుల విభాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ అందే వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని పద్మశాలి కళ్యాణమండపంలో, పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో పద్మశాలియ వైద్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి విశేషమైన వైద్య సేవలు అందించిన పలువురు సీనియర్ వైద్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పద్మశాలి వైద్యుల విభాగం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సింగరి ప్రభాకర్ (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తనికంటి ముని రామ ప్రసాద్ (ప్రొద్దుటూరు), కోశాధికారిగా డాక్టర్ కొల్లి జయ కిషన్ (గుంటూరు) బాధ్యతలు చేపట్టారు.

ఈ నూతన కార్యవర్గంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన వైద్యులకు చోటు కల్పించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి. సాంబశివరావు, డాక్టర్ ఎ. లవ కుమార్, డాక్టర్ ఎం. నవ్య, డాక్టర్ ఎస్. రవి, డాక్టర్ టి. పెరుమాళ్లు, డాక్టర్ సిహెచ్. కావ్య, డాక్టర్ వి. నరసింహారావు, డాక్టర్ జి. రవి శంకర్, డాక్టర్ వి. పరమేశ్వరి బాబు, డాక్టర్ డి. రామకృష్ణ హనుమాన్, డాక్టర్ నూకల కిరణ్ కుమార్ ఎన్నికవగా, మహిళా ఉపాధ్యక్షులుగా డాక్టర్ సింగరి అరుణ, డాక్టర్ సిహెచ్. శోభా దేవి, డాక్టర్ టి. మహతి బాధ్యతలు స్వీకరించారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వి. ఉదయ్ కుమార్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జి.వి. పున్నారావు, డాక్టర్ ఎ. సత్య ప్రకాష్, డాక్టర్ అవ్వారు అర్జున్, డాక్టర్ అవ్వారు వెంకట రంగస్వామి, డాక్టర్ జింక కార్తీక్, డాక్టర్ ధనరాజు, డాక్టర్ బాల తిమ్మయ్య, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వి. శ్రీనివాసరావు, డాక్టర్ అవినాష్, డాక్టర్ శ్యాం కుమార్, డాక్టర్ వి. గౌతమ్, డాక్టర్ ఎన్.వి.వి. తిలక్, డాక్టర్ సేపూరి రామ్మోహన్ రావు, డాక్టర్ ఎన్. పూర్ణ చంద్ర రావు నియమితులయ్యారు. పద్మశాలి వైద్యుల సంక్షేమంతో పాటు సమాజ సేవలో విభాగం చురుగ్గా పాల్గొంటుందని నూతన అధ్యక్షులు డాక్టర్ అందే వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన శుభకాంక్షలు నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వైద్యుల విభాగం రాష్ట్ర కార్యవర్గానికి పద్మశాలి యువసేన తరఫున రాష్ట్ర ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా యువసేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విరివిగా జరుగుతున్న పలు సామాజిక, ఉచిత వైద్య శిబిరాల వంటి సేవా కార్యక్రమాలకు నూతన కార్యవర్గం తమ వంతు సంపూర్ణ సహకారం, సపోర్ట్ అందించాలని వారు కోరారు. రాబోయే రోజుల్లో పద్మశాలి వైద్యుల విభాగం మరియు యువసేన సంయుక్తంగా కలిసి మరిన్ని సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, సమాజంలో వెనుకబడిన వర్గాలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో నూతన నాయకత్వం క్రియాశీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా యువసేన ప్రతినిధులు ఆకాంక్షించారు.

# రామాలయ నిర్మాణానికి 'ఎరుకల సేవా సంఘం' ఆర్థిక సాయం

రాజుపాలెం, జూలై 05: కొత్త బోధనం గ్రామంలోని ఎరుకల కాలనీలో నిర్మిస్తున్న రామాలయ స్లాబ్ నిర్మాణం నిమిత్తం ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా గోపి రూ. 30,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం సంఘం ముఖ్య నాయకుల సమక్షంలో ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే రాబోయే రోజుల్లో ఎరుకల జాతి మూలపురుషుడైన ఏకలవ్య మహారాజ్ విగ్రహాన్ని సంఘం ఆధ్వర్యంలోనే ఇక్కడ ఘనంగా ఏర్పాటు చేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ పాలపర్తి శ్రీనివాస్ చక్రవర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు తోకల నరసింహారావు, గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి రాజారావుతో పాటు స్థానిక కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# టీడీపీ నేత రాఘవరావుకు ఎమ్మెల్యే కన్నా ఘన నివాళి

రాజుపాలెం, జూలై 05: సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన వెంకట రాఘవరావు యాదవ్ మృతి పట్ల టీడీపీ శ్రేణులు తీవ్ర నివాళులర్పించాయి. ఆయన పార్థివదేహానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాల వేసి అంజలి ఘటించారు. రాఘవరావు మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు (మల్లిబాబు) రాఘవరావు భౌతికకాయానికి నివాళులర్పించి, పార్టీ జెండా కప్పి అంతిమయాత్రలో పాడె మోశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అబ్బూరు మల్లి, పూజల వెంకట కోటయ్య, వడ్డెంపూడి పవన్ సహా పలువురు నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.



## ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖ మత్స్యకారులు సురక్షితం

**: మంత్రి అచ్చెన్నాయుడు**

అమరావతి, జూలై 05: సాంకేతిక లోపంతో ఒడిశా తీరంలో సముద్రం మధ్యలో చిక్కుకుపోయిన విశాఖపట్నం మత్స్యకారులందరూ సురక్షితంగా ఉన్నారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. విశాఖకు చెందిన ఒక మత్స్యకార బోటు సముద్రంలో నిలిచిపోయినట్లు సమాచారం అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించిందని ఆయన తెలిపారు. ఒడిశా మెరైన్ పోలీసులతో పాటు, అక్కడి మత్స్యశాఖ ఉన్నతాధికారులతో ఏపీ ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సహాయక చర్యలను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. ఈ ఉమ్మడి ఆపరేషన్ ఫలితంగా బోటు యజమాని దానయ్యతో సహా అందులోని 10 మంది మత్స్యకారులను ఒడిశా మెరైన్ పోలీసులు సురక్షితంగా రక్షించి ఒడ్డుకు చేర్చారని మంత్రి వివరించారు. విపత్కర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి, ఏపీ మత్స్యకారుల ప్రాణాలను కాపాడినందుకు ఒడిశా ప్రభుత్వానికి, మెరైన్ పోలీసులకు, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రక్షించబడిన మత్స్యకారులందరినీ వీలైనంత వేగంగా, సురక్షితంగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం, అధికారులు అండగా నిలిచారని పేర్కొన్నారు. సమయస్ఫూర్తితో స్పందించి, రెండు రాష్ట్రాల సమన్వయంతో ప్రాణనష్టం జరగకుండా మత్స్యకారులను కాపాడటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## విశాఖ తీరంలో
# మత్స్యకారుల గల్లంతు

**ఒకరు సురక్షితం, ఆరుగురు కోసం గాలింపు ముమ్మరం.. అండగా ఉంటామని హోంమంత్రి అనిత భరోసా**



విశాఖపట్నం, జులై 05: విశాఖ తీరంలో వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె, మత్స్యకారులను సురక్షితంగా తీరానికి చేర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని స్పష్టం చేశారు. బాధిత మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆమె భరోసా ఇచ్చారు. ఇప్పటికే మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు బాధిత కుటుంబాలను నేరుగా పరామర్శించి ధైర్యం చెప్పారని మంత్రి వెల్లడించారు.

**అధికారులతో నిరంతర సమీక్ష..**
**తక్షణ సహాయానికి ఆదేశాలు**

ఈ ఘటనపై హోంమంత్రి అనిత ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, డీఐజీలు, నగర పోలీసు కమిషనర్, ఎస్పీలు, ఐజీ మెరైన్స్, కోస్టల్ గార్డ్ డీఐజీ, మత్స్యశాఖ అధికారులతో నిరంతరం సమీక్ష జరుపుతూ సమన్వయంతో గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందించాలని అధికారులకు సూచించారు.

**నేవీ హెలికాప్టర్లు,**
**కోస్ట్‌గార్డ్ నౌకలతో రెస్క్యూ ఆపరేషన్**

ఈ నెల 1వ తేదీన మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారని, అనంతరం వాతావరణం అనుకూలించకపోవడం, వారి నుంచి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని హోంమంత్రి తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ప్రస్తుతం నేవీ హెలికాప్టర్, కోస్ట్‌గార్డ్ నౌకలు, మెరైన్ బోట్ల సహాయంతో సముద్రంలో నిరంతరాయంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు.

**బోటు తిరగబడటం వల్లే ప్రమాదం:**
**సీఎం, డిప్యూటీ సీఎం ఆరా**

మరోవైపు ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత విస్తృతం చేయాలని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. కాగా, ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన బోటు యజమాని కారె చిన్నయ్య (మంత్రి ప్రకటనలో అప్పారావుగా పేర్కొన్న బోటు యజమాని) మీడియాకు వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం బోటును హార్బర్ వైపు తిప్పే క్రమంలో కెరటాల ఉద్ధృతికి బోటు తిరగబడిందని, రాత్రికి అది పూర్తిగా మునిగిపోవడంతో తాను ఒక వాణిజ్య నౌక (షిప్) సహాయంతో ప్రాణాలు దక్కించుకున్నానని, మిగిలిన ఆరుగురు ఎక్కలేకపోయారని తెలిపారు.

**బాధితుల వివరాలు**

విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన చిన్నా, గరగయ్య, అప్పలరాజు, కారె చిన్నయ్య, సీతోడుతో పాటు విశాఖ జిల్లా భీమిలి మండలం పెదనాగమయ్యపాలేనికి చెందిన బండియ్య, విశాఖకు చెందిన చిన్న అమ్మోరు ఈనెల 1న వేటకు వెళ్లారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రస్తుతం గల్లంతైన మిగిలిన ఆరుగురు జాలర్ల కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోంది.

## విజయ డెయిరీ ప్రజల సొత్తు

**మరింత బలోపేతం చేస్తాం: మంత్రి వాకిటి**

షాద్‌నగర్, జూలై 05: విజయ డెయిరీ రాష్ట్ర ప్రజల సొత్తని, దాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాల స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రోజుకు అదనంగా మరో 25 లక్షల లీటర్ల పాల అవసరం ఉందని, ఇకపై ఇతర రాష్ట్రాల నుంచి పాలు కొనుగోలు చేసే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోనే పాల ఉత్పత్తిని భారీగా పెంచుతామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా విజయ డెయిరీ ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమన్న ఆయన భవిష్యత్ తరాలకు నాణ్యమైన పాలు అందించే లక్ష్యంతో పాడి పరిశ్రమలో సమూల మార్పులు తీసుకొస్తామని ఉద్ఘాటించారు.

చిన్నప్పటి నుంచి పాడి పరిశ్రమ వాతావరణంలో పెరిగిన వ్యక్తిగా రైతుల కష్టసుఖాలు తనకు బాగా తెలుసని మంత్రి శ్రీహరి అన్నారు. వేకువజామునే లేచి కష్టపడే పాడి రైతులకు ఇకనుంచి 15 రోజులకోసారి బిల్లులు చెల్లించేలా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు రుణాలు, ఇతర సౌకర్యాల కల్పనపై ఇప్పటికే బ్యాంకులతో చర్చించామని, వారు సమాజంలో తలెత్తుకొని జీవించేలా పాడి పరిశ్రమను తీర్చిదిద్దుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డెయిరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీకొట్టిన బస్సు..
# నలుగురు మృతి

**చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ప్రమాదం**



చిట్యాల, జూలై 05: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒడిశాకు చెందిన అర్షియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జవగా, అందులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వీవీ ప్రసాద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మెరుగైన చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ప్రసాద్ భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు ఆయన స్నేహితుడు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వీరంతా ఏపీలోని కాకినాడకు చెందిన వారు కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు వారి వద్ద లభించిన గుర్తింపు పత్రాల ఆధారంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, క్రేన్ సాయంతో మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై కాసేపు ట్రాఫిక్ జామ్ కాగా, పోలీసులు రాకపోకలను పునరుద్ధరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో
# తెలుగు ఫ్యామిలీకి కష్టం

**అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్!**



ఇంటర్నెట్ డెస్క్, జూలై 05: హాంకాంగ్ విమానాశ్రయంలో పాస్‌పోర్టులు పోగొట్టుకుని, ఇద్దరు చిన్నారులతో 52 గంటలుగా చిక్కుకుపోయిన తెలుగు కుటుంబానికి ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో తక్షణ సహాయం లభించింది. హైదరాబాద్‌కు చెందిన బొల్లా రాజేశ్వరి తన కుటుంబంతో కలిసి ఈ నెల 2న కాథే పసిఫిక్ విమానంలో చికాగోకు బయలుదేరారు. అయితే, మార్గమధ్యంలో విమానంలో రెండు భారతీయ, రెండు అమెరికా పాస్‌పోర్టులు ఉన్న బ్యాగును పోగొట్టుకోవడంతో, హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే ఐదు, మూడేళ్ల వయసున్న తమ పిల్లలతో కలిసి వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్లిష్ట పరిస్థితిపై బాధితురాలు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సహాయం చేయాల్సిందిగా మంత్రి నారా లోకేశ్‌ను అభ్యర్థించారు. బాధితురాలి విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించి, విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. లోకేశ్ చొరవతో విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి హాంకాంగ్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను సంప్రదించింది. ప్రస్తుతం ఆ కుటుంబంతో భారత రాయబార కార్యాలయ అధికారులు నిరంతర సంప్రదింపుల్లో ఉన్నారని, వీలైనంత త్వరగా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించి గమ్యస్థానానికి చేరుస్తామని వెల్లడించారు. విపత్కర పరిస్థితుల్లో వేగంగా స్పందించి అండగా నిలిచిన కేంద్ర విదేశాంగ శాఖకు, భారత రాయబార కార్యాలయానికి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

## కూటమి పాలనలో రౌడీ పోలీస్ రాజ్యం

**ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం**

అమరావతి, జూలై 05: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజకీయ అణచివేత చర్యల కోసమే పోలీసు వ్యవస్థను వాడుకుంటూ, ప్రశ్నించే వారి గొంతు నొక్కేలా అత్యంత ప్రమాదకర ధోరణిలో నడిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "హే రామ్... సేవ్ ఆంధ్రప్రదేశ్" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై నేరాలు జరుగుతున్నా పోలీసులు కదలడం లేదని, తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై నెల రోజులు దాటినా ఆచూకీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావలిలో గిరిజన మహిళపై దాడి జరిగితే నిందితులను వదిలి బాధితులపైనే ఎదురు కేసులు పెట్టారని, పెద్దాపురంలో దివ్యాంగురాలైన బాలికపై జరిగిన దాడిలో నిందితులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. సాయికృష్ణ, గంగమ్మ, తిరుపతమ్మల లాకప్‌డెత్‌లు, క్రాంతికుమార్ ఆత్మహత్య వంటి ఘటనలు రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు తీవ్ర తలవంపులు తెచ్చాయని, వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే చంద్రబాబు నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న యాక్టివిస్టులపై బెయిల్ రాని సెక్షన్లు పెట్టి, వారిని ఆర్గనైజ్డ్ క్రిమినల్స్‌గా చిత్రీకరించాలని ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వైఎస్ జగన్ విమర్శించారు. యూట్యూబ్ ఇన్‌ఫ్లూ యెన్సర్ కేవీఆర్‌ను చట్టవిరుద్ధంగా హైదరాబాద్ నుండి తరలించడం, యూట్యూబర్ రావణ్‌కు కోర్టుల్లో బెయిల్ వచ్చినా అహంకారంతో పోలీస్ స్టేషన్లపై దాడులు చేయించి తీవ్రవాద అభియో గాలు మోపడం దుర్మార్గమన్నారు. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు చేసిన విమర్శలనే ఇప్పుడు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రశ్నిస్తున్నారని, అలాంటప్పుడు అవే అభియోగాలు వీరిపై కూడా పెట్టాలి కదా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు కావాల్సింది కాకుండా రాజ్యాంగానికి లోబడి నడిచే పోలీసు వ్యవస్థ, పాలన కావాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.



## వయ్యారి చిత్రం






# సింగ్ గీతం ఓటీటీకి రెడీ

రెగ్యులర్ కమర్షియల్ సినిమాలతో పోలిస్తే అప్పుడప్పుడు కాస్త డిఫరెంట్ మూవీస్ కూడా రిలీజ్ అవుతుంటాయి. అలాంటి వాటిలో 'సింగ్ గీతం' ఒకటి. 94 ఏళ్ల వయసులోనూ సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని తీశారు. ఇప్పుడీ సినిమాకు సంబంధించిన ఓటీటీ అధికారిక ప్రకటన వచ్చేసింది. ఇంతకీ ఇది ఎందులోకి ఎప్పుడు రానుంది. అయానే, అహల్య, షాలినీ అని కొత్త నటీనటులు ప్రధాన పాత్రలు చేసిన మూవీ 'సింగ్ గీతం'. సింగీతం శ్రీనివాసరావు దర్శకుడు కాగా కల్కి, మహానటి మూవీస్ తీసిన నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించాడు. ఇందులో డైలాగ్స్ తక్కువగా ఉంటాయి. పాటలే ఎక్కువగా ఉంటాయి. అత్యాశ అనే కాన్సెప్ట్‌తో దీన్ని తెరకెక్కించారు. గత నెల 11వ తేదీన థియేటర్లలో రిలీజైంది. పర్లేదనిపించింది. ఇప్పుడు ఈ బుధవారం(జూలై 08) నుంచి నెట్‌ఫ్లిక్స్‌లోకి రానుంది. ఈ మేరకు అధికారికంగా అప్‌డేట్ ఇచ్చారు. 'సింగ్ గీతం' విషయానికొస్తే.. జైలు నుంచి బయటకొచ్చిన ప్రతాప్, తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూములు కుబేరపురం అనే ఊరిలో ఉన్నాయని తెలుసుకుని అక్కడికి వెళ్తాడు. అయితే అవి సాధారణ భూములు కాదని వాటిలో బంగారు గనులున్నయాని తెలుస్తుంది. అయితే ఇదే ఊరిలో ఉన్న ఏకైక చెట్టుని తల్లిలా చూసుకుంటుంది గౌరి(అహల్య). బంగారం తవ్వేందుకు ఈ చెట్టుని కొట్టేసిన తర్వాత ఊరంతటికి శాపం తగులుతుంది. దీంతో అందరి నోటి నుంచి మాటలకు బదులు పాటలు వస్తుంటాయి. మరి ఈ శాపం నుంచి విముక్తి ఎలా పొందారు? మనుషుల్లోని అత్యాశ వల్ల ఎన్ని ఇబ్బందులొచ్చాయి? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.

# 10న విడుదలవుతున్న లెనిన్



అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

# అలా అనడంతో బాధపడ్డా

సినీరంగంలో పురుషాధిక్యతపై తాజా ఇంటర్వ్యూలో బాలీవుడ్ భామ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలను ఈ ఇంటర్వ్యూలో ఆమె గుర్తు చేసుకున్నది. సినీరంగంలో పురుషాధిక్యతపై తాజా ఇంటర్వ్యూలో బాలీవుడ్ భామ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలను ఈ ఇంటర్వ్యూలో ఆమె గుర్తు చేసుకున్నది. 'సినిమాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మొదట్నుంచీ నాకెక్కువే. ఫలానా సన్నివేశం ఇలా చేస్తే బావుంటుందని చెప్పాలనుంటుంది. కానీ ఇక్కడ హీరోయిన్లకు అంత సీన్ లేదు. ఓసారి ఓ దర్శకుడికి ఇలాగే సలహా ఇచ్చేందుకు ప్రయత్నించా. ఆయన ఇరిటేటవుతూ 'మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావ్.. చెప్పింది చెయ్' అన్నారు. నా మనసు చివుక్కుమన్నది. అదే సలహా హీరోలు ఇస్తే, 'ఆహా.. ఓహో..' అంటూ మెచ్చుకుంటారు.



# చిరంజీవిని నేను సపోర్ట్ చేస్తున్నానని అనుకోవద్దు



'నిజం చెప్పాలంటే చిరంజీవి ఏ మూడ్‌లో, ఏ కారణంతో అన్నారో నాకు తెలీదు. ప్రతిదాన్ని నెగిటివ్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మొన్న తిరుమల నుంచి బయటకొచ్చిన తర్వాత.. పద్మశ్రీ అవార్డ్ నాకు స్వామి ఇప్పించారు. నాకు అంత సీన్ ఎక్కడుంది అని సరదాగా అన్నారు. నాకు అంత సీన్ లేదు అన్నట్లు ఎవడో హెడ్ లైన్ పెట్టాడు. నేనే చేయలేను. అలానే చిరంజీవి కూడా వేరే సందర్భంలో అన్నారని అనుకుంటున్నాను''అలా అని ఆయన్ని నేను సపోర్ట్ చేస్తున్నానని అనుకోవద్దు. ప్రతిదీ అదే అర్థంతో తీసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నాను. అవార్డుల విషయంలో నార్త్, సౌత్ అనే డిస్కషన్ అయితే ఉంది. చిరంజీవికి ఎన్నో బ్రహ్మాండమైన అవార్డులు వచ్చాయి కదా. ఈ రోజు దేశంలోనే అత్యున్నత స్థానాల్లో ఉన్నవారిలో చిరంజీవి ఒకరు. కాబట్టి ఇలాంటివి విన్నా అప్పుడే మర్చిపోండి' అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

# సకుటుంబ ఆనందాల వేళ..



మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించిన చిత్రం 'వసుదేవసుతం' వైకుంఠ్ బోను దర్శకుడు. ధనలక్ష్మి బాదర్ల నిర్మాత. జూలై 10న సినిమా విడుదల కానున్నది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి పాట విడుదల చేశారు. మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించిన చిత్రం 'వసుదేవసుతం' వైకుంఠ్ బోను దర్శకుడు. ధనలక్ష్మి బాదర్ల నిర్మాత. జూలై 10న సినిమా విడుదల కానున్నది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి పాట విడుదల చేశారు. 'ఆనందాల వేళ..' అంటూ సాగే ఈ పాటను ఆది సాయికుమార్ ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ పాటను, మణిశర్మ స్వరపరచగా, సాయిచరణ్ భాస్కరుని, శృతిక సముద్రాల ఆలపించారు. కుటుంబ ఆనందోత్సాహాల నేపథ్యంలో ఈ పాట సాగింది. ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని ఈ పాట చెబుతున్నది. జాన్ విజయ్, మైమ్ గోపి, సురేష్‌చంద్ర మీనన్, ఈశ్వర్య లక్ష్మి, తులసి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జిజ్జు సన్ని, నిర్మాణం: రెయిన్‌బో సినిమాస్.

# పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి



టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷–టగ్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.



## శివమ్ దూబేను ఎదుర్కోవడం ఇంగ్లాండ్‌కు పెద్ద సవాలే

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సమరం క్రికెట్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. తొలి మ్యాచ్‌లో వర్షం పడటంతో ఫలితం తేలకపోయినప్పటికీ, టీం ఇండియా హిట్టర్ శివమ్ దూబే ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇంగ్లాండ్ శిబిరంలో వణుకు పుట్టించింది. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. సెస్టర్లీ స్ట్రీట్ వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ప్రారంభంలోనే ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో అభిషేక్ శర్మ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఇంగ్లాండ్ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 అద్భుతమైన సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దూబే మెరుపు దాడి వల్లే భారత్ నిర్ణీత ఓవర్లలో 189 పరుగుల భారీ స్కోరు సాధించగలిగింది. పిచ్ పరిస్థితులను బట్టి చూస్తే అంతటి భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఇంగ్లాండ్‌కు అసాధ్యమని, కేవలం వర్షం వల్ల మ్యాచ్ రద్దు కావడంతోనే ఇంగ్లాండ్ ఓటమి నుంచి తప్పించుకుందని క్రికెట్ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దూబేకు స్పిన్ బౌలింగ్‌ను చీల్చి చెండాడటంలో అద్భుతమైన రికార్డు ఉంది. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతను స్పిన్నర్లపై విరుచుకుపడతాడు. ఈ విషయం తెలిసి కూడా తొలి మ్యాచ్‌లో చివరి ఓవర్లలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ స్పిన్నర్లను రంగంలోకి దించి పెద్ద తప్పే చేశాడు. దూబే ఆ స్పిన్ బౌలింగ్‌ను ఉతికారేస్తూ సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ వ్యూహాత్మక లోపాన్ని ఇంగ్లాండ్ కెప్టెన్ స్వయంగా అంగీకరించక తప్పలేదు.




## టీమిండియాపై పాక్ కోచ్ ప్రశంసల వర్షం!

భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటే.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో క్రేజ్ ఉంది. వేదిక ఎక్కడైనా.. ఈ మ్యాచ్ వచ్చిందంటే చాలు స్టేడియాలు నిండిపోతాయి, కోట్లాది మంది ప్రజలు టీవీలకు అతుక్కుపోతారు. ఇక మైదానంలోనూ ఆటగాళ్ల మధ్య భావోద్వేగాలు తారాస్థాయికి చేరతాయి. అందుకే దాయాదుల మధ్య మ్యాచ్‌కు ఎనలేని క్రేజ్ ఉంది. ఇక పల్వామా ఉగ్రదాడి తర్వాత భారత ఆటగాళ్లు.. పాక్ క్రికెటర్లకు షేక్ హ్యాండ్ ఇవ్వడం మానేశారు. అప్పటి నుంచి చాలాసార్లు మ్యాచ్ జరిగినా.. నో షేక్ హ్యాండ్ మాత్రం కొనసాగించారు. అయితే భారత్ అంటే చాలు.. ఆ దేశ మాజీలు, ప్రస్తుత క్రికెటర్లు విద్వేషపూరిత మాటలు మాట్లాడతారు. కానీ పాక్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ మాత్రం అందుకు భిన్నంగా కామెంట్స్ చేశాడు. ప్రస్తుతం పాకిస్థాన్‌కు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో హెడ్ కోచ్ మైక్ హెస్సన్ ఉన్నాడు. ఇటీవల అతడు భారత క్రికెట్ జట్టుపై ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుతం ప్రపంచంలోనే టీమిండియా అత్యుత్తమ టీమ్ అని పొగడ్తలతో ముంచెత్తాడు. పాకిస్థాన్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతి జట్టు భారత జట్టును ఓడించడానికి ఇబ్బంది పడుతోందన్నాడు. "గతేడాది జరిగిన ఆసియా కప్ 2025లో భారత్‌తో జరిగిన మూడు మ్యాచ్‌లు మినహా మిగిలిన అన్ని మ్యాచ్‌లలో మేం గెలిచాం. నిజానికి ప్రస్తుతం ప్రపంచంలోని ఏ జట్టైనా భారత్‌ను ఓడించాలంటే తీవ్రంగా శ్రమిస్తోంది. కేవలం పాకిస్థాన్ జట్టు మాత్రమే కాదు, ప్రతి జట్టుదీ ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం భారత్ అత్యుత్తమ జట్టు మాత్రమే కాదు.. మిగిలిన జట్ల కంటే ఎంతో ముందుంది. పాకిస్థాన్ ఐసీసీ టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌లకు పదే పదే అర్హత సాధించాలంటే అన్ని జట్లపై కూడా మంచి ప్రదర్శన చేసి, విజయాలు సాధించాల్సి ఉంటుంది" అని మైక్ హెస్సన్ పేర్కొన్నాడు. కాగా ఆసియాకప్ 2025 విజేతగా భారత్ నిలిచింది. ఈ టోర్నీలో భారత్, పాక్ మధ్య మూడు మ్యాచ్‌లు జరిగాయి.




# ఆసీస్.. ఏడో సారి




## మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా

**మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అద్భుతం జరగలేదు. ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా జోరుకు తలొగ్గిన ఇంగ్లండ్ కప్‌ను అప్పగించింది. లార్డ్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో రెచ్చిపోయిన ఆసీస్ రికార్డు స్థాయిలో ఏడోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 151 లక్ష్య ఛేదనలో బేత్ మూనీ(64), ఫొబో లిచ్‌ఫీల్డ్0(48) ఉతికేశారు. పవర్ ప్లేలోనే 62 కొట్టిన కంగారూ టీమ్.. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. నాలుగోసారి పొట్టి కప్ ఫైనల్లో కంగుతిన్న ఇంగ్లండ్ సొంతగడ్డపై చెక్కుచెదరని రికార్డును చేజేతులా పోగొట్టుకుంది.**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. ఆదివారం లార్డ్స్ మైదానం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఆసీస్.. ఏడో సారి పొట్టి ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. ఈ తుది పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 150 పరుగుల స్కోర్ సాధించింది.

ఇంగ్లండ్ బ్యాటర్లలో ఓపెనర్లు అమీ జోన్స్(6), డ్యానీ వ్యాట్(8) విఫలమైనప్పటికి నాట్ స్కివర్(58 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. ఆమెతో పాటు ఆఖరిలో ఫ్రేయా కెంప్ (44 నాటౌట్) దూకుడుగా ఆడింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, హామిల్టన్,కెప్టెన్ సోఫీ, సదర్లాండ్ తలా వికెట్ సాధించారు.

ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, హామిల్టన్,కెప్టెన్ సోఫీ, సదర్లాండ్ తలా వికెట్ సాధించారు. అనంతరం 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 17.1 ఓవర్లలో ఛేధించింది. ఆసీస్ బ్యాటర్లలో సీనియర్ ఓపెనర్ బెత్ మూనీ(64) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. యువ ప్లేయర్ ఫిభీ లిచ్ ఫీల్డ్(35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48) మెరుపులు మెరిపించింది.

టాస్ ఓడిన ఇంగ్లండ్‌కు ఫైనల్లో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ అమీ జోన్స్(6)ను ల్యూసీ హామిల్టన్ ఔట్ చేయగా.. డేంజరస్ డాని వ్యాట్ హెుడ్గే(8) సైతం విఫలమైంది. టపటపా రెండు కీలక వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(58 నాటౌట్) బాధ్యతగా ఆడింది. ఒత్తిడిలోనూ ధనాధన్ ఆడిన అలలీసే క్యాప్సే(23) ఆసీస్ బౌలర్ల లయను దెబ్బతీసింది. అయితే.. గార్డ్‌నర్ వేసిన 9 ఓవర్లో క్యాప్సే 6, 4, 4 తో 16 రన్స్ పిండుకోగా స్కోర్ 60 దాటింది. అదే విధంగా ధాటిగా ఆడే క్రమంలో మొలినెక్స్ వేసిన బంతిని స్కూప్ చేయబోయి క్యాప్సే బౌల్డయ్యింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హీథర్ నైట్(2) వికెట్ల ముందు దొరికిపోయింది. అంతే.. ఇంగ్లండ్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.




## వాళ్లిద్దరి కెరీర్ త్వరగా ముగుస్తుంది!

### లెజెండరీ కెప్టెన్ కపిల్ దేవ్

ప్రస్తుతం టీమిండియా ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌తో బిజీగా ఉంది. ఐర్లాండ్‌పై రెండు టీ20ల సిరీస్ ఓడిపోయిన తర్వాత.. పటిష్టమైన ఇంగ్లాండ్‌పై గెలిచి పరువు నిలబెట్టుకోవాలని యంగ్ టీమిండియా తహతహలాడుతోంది. ఇప్పటికే తొలి టీ20 వర్షం కారణంగా రద్దు అయింది. ఇక ఈ రోజు (జూలై 4) రెండో టీ20 జరగనుంది. ఈ క్రమంలోనే టీమిండియా దిగ్గజ మాజీ క్రికెటర్, 1983 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వయసు గురించి ఎవరు మాట్లాడాల్సిన అవసరం లేదని అన్నారు.వాళ్లిద్దరూ పరుగులు చేస్తున్నంత కాలం వారి వయసు గురించి చర్చ అనవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే కెరీర్ చివరి దశకు వచ్చిన తర్వాత వయసు రీత్యా వారి ఫిట్‌నెస్, ఫామ్ వేగంగా పడిపోతుందని పేర్కొన్నారు. అలా చూస్తే వారి కెరీర్ ఎక్కువ రోజులు కొనసాగే అవకాశం లేదని, దాని కోసం పెద్దగా చర్చ అవసరం లేదనే ఉద్దేశంతో కపిల్ దేవ్ మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలనే టార్గెట్‌తో ఉన్నారు. మరి అది ఎంత వరకు సాధ్యం అవుతోందో చూడాలి. ప్రస్తుతం అయితే ఈ నెల 14 నుంచి ఇంగ్లాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం వారిద్దరూ రెడీ అవుతున్నారు. ఇప్పటికే అలీబాగ్‌లో విరాట్ కోహ్లీ ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. రోహిత్ కూడా ఈ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. ఇద్దరికీ ఇంగ్లాండ్‌లో మంచి రికార్డులు ఉన్నాయి. పైగా వారికి ఉన్న అనుభవంతో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కచ్చితంగా రాణిస్తారని క్రికెట్ అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.




## క్వార్టర్ ఫైనల్లో జకోవిచ్..

వింబుల్డన్‌లో నొవాక్ జకోవిచ్ జోరు చూపిస్తున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన ప్రీ-క్వార్టర్స్ పోరులో రోమన్ సఫీల్లిన్(రష్యా)ను చిత్తు చేశాడు. ఈ విక్టరీతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టాడు జకో. వింబుల్డన్‌లో 106వ విజయంతో ఫెదరర్‌ను అధిగమించాడీ సెర్బియా స్టార్. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జకోవిచ్ ఈసారి చెలరేగిపోతున్నాడు. 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి పెట్టిన జకో.. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరుకున్నాడు. రోమన్ సఫీల్లిన్(రష్యా) నుంచి గట్టి పోటీ ఎదురైనా చివరకు.. 7-6(6), 6-3, 3-6, 6-3తో గెలుపొందిన అతడు ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక విజయాల(105) రికార్డును తన వశం చేసుకున్నాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 6-7-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# శాంతి చర్చల పేరుతో దొంగాట!

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది.

ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మెహరింప జేస్తోంది. హర్మూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు.

ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హార్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగ్నమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్రిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హార్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.



# కుద్దాల జాతక కథ

**"తిరిగి ఓడిపోవచ్చే విజయం నిజమైన విజయం కాదు. ఎన్నటికీ ఓటమి పాలుకాని విజయం మాత్రమే నిజమైన విజయం. అంటే, ఇతరులను జయించడం కంటే తన మనసులోని తృష్ణ, రాగం, ద్వేషం, మోహాన్ని జయించడమే శాశ్వత విజయం."**

ఒకప్పుడు వారణాసి నగరంలో ఒక పేద తోటమాలి జీవించేవాడు. అతని వద్ద ఉన్న ఏకైక ఆస్తి ఒక కుద్దాల (పార/గునపం) మాత్రమే. రోజూ కష్టపడి పనిచేస్తూ జీవించేవాడు. అతివృష్టి ,అనావృష్టి, కోతులు, కీటకాలు అతని పంటపై తీవ్ర ఇబ్బందులు కలిగించేవి. అతనికి ఒక రోజు విరక్తి కలిగింది. "ఈ సంసార జీవితం అంతులేని శ్రమ" అని భావించి ఆరామానికి చేరాడు. కానీ చేరడానికి ముందు తన పారను ఒక చెట్టుమీద పెట్టాడు. కొద్ది రోజుల తర్వాత తన కుద్దాల గుర్తుకు వచ్చింది. తోటపని ఉత్తమం అనుకున్నాడు పనిమీద మమకారం కలిగి మళ్లీ ఇంటికి వచ్చి పని చేసేవాడు. మళ్లీ కొంత కాలానికి ఆరామం చేరాడు... ఇలా ఆరు సార్లు సంసారాన్ని విడిచి వెళ్లి, మళ్లీ కుద్దాల( పార) మీద మమకారంతో తిరిగి వచ్చాడు. అందుకే అతన్ని కుద్దాల బిక్కు అన్నారు. ఏడోసారి అతను తనలో తాను ఇలా ఆలోచించాడు: "నన్ను బంధించింది ఈ కుద్దాలే. బిక్కు జీవితం ద్వారానే సమాజంలోని శీలప్రవర్తన మెరుగు పరచగలను .దీన్ని పూర్తిగా వదలకపోతే నిజమైన స్వేచ్ఛ లభించదు." అని నిర్ణయించి, ఆ కుద్దాలను ఒక నదిలోకి బలంగా విసిరేశాడు. తర్వాత ఆనందంతో ఇలా అరిచాడు:


"నేను గెలిచాను! నేను గెలిచాను!" ఆ సమయంలో అక్కడుగా వెళ్తున్న వారణాసి రాజు ఆ మాటలు విని, "ఎవరిని గెలిచావు?" అని అడిగాడు. కుద్దాల పండితుడు ఇలా జవాబిచ్చాడు:"రాజా! ఇతరులను గెలవడం గొప్ప విజయం కాదు. మన మనసులోని తృష్ణ, మమకారం, లోభాన్ని జయించడమే నిజమైన విజయం." ఆ మాటలు రాజును బాగా ప్రభావితం చేశాయి. రాజు కూడా బౌద్ధ ఉపాసకుడుగా మారాడు.

"సబ్బే సత్తా సుఖీ హొంతు"
(సమస్త ప్రాణులు సుఖంగా ఉండుగాక.)

# జంతు సంబంధ వ్యాధులకు చెక్ పెట్టండి!

**..06 జూలై "ప్రపంచ జునోసిస్ దినం" సందర్భంగా..**

**అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు.**



ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను "జునోటిక్ వ్యాధులు"గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రుంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది.

### ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తం:

జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున "ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)" పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున "లూయీ పాశ్చర్" అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తంగా "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం (వన్ వరల్డ్, వన్ హెల్త్)" అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించ వచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

### జునోటిక్ వ్యాధులు సోకడానికి కారణాలు:

ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేటిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

### జునోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు:

జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.